గృహిణి బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయం

ఘట్‌కేసర్: బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోవాలని వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఓ గృహిణి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు మాయమైన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బొక్కొనిగూడకు చెందిన బాధితురాలి ఫోన్‌కు బ్యాంకు ఖాతా అప్‌డేట్ చేసుకోవాలని, లేనిపక్షంలో ఖాతా బ్లాక్ అవుతుందని బుధవారం మెసేజ్ వచ్చింది. స్పందించిన ఆమె వాట్సాప్‌లో వచ్చిన లింకును ఓపెన్ చేసి అడిగిన వివరాలన్నీ నమోదు చేసింది. పాన్ కార్డు వివరాలు నమోదు అనంతరం వచ్చిన ఓటీపీని సైతం నమోదు చేసింది. దీంతో ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.లక్ష మాయమైంది. వెంటనే ఆమె ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్ట్


మిధున్‌పటేల్

మల్కాజిగిరి: ద్విచక్ర వాహనాలను దొంగతనం చేసిన యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. కర్నాటక రాష్ట్రం బసవకళ్యాణ్ ప్రాంతానికి చెందిన మిధున్‌పటేల్(27) మల్కాజిగిరి ప్రాంతంలో ఫ్రూట్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ ఏడాది జనవరి నెలలో పల్సర్, యాక్టివా దొంగతనం చేసి పారిపోయాడు. గురువారం జెట్టీసీ క్రాస్ రోడ్స్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. రెండు బండ్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు.

శాంతివనం పార్కులో ఎన్నికల ప్రచారం


శాంతివనం పార్కులో ప్రచారం చేస్తున్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

మేడిపల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి శాంతివనం పార్కులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, స్థానిక నాయకులతో కలిసి శాంతివనం పార్కులో వాకింగ్ చేస్తూ గురువారం ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు వజ్రేష్ యాదవ్, సునీత మహేందర్‌రెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జంట కార్పొరేషన్ల కాంగ్రెస్ నాయకులు వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌వోటీ పోలీసులు గంజాయిని గురువారం పట్టుకున్నారు. వివరాలు.. ఒడిశాకు చెందిన గిరిధారి(38) నగరంలోని తిరుమలగిరికి చెందిన రోహిత్‌కుమార్(24)లు వీరిద్దరూ కలిసి గంజాయిని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్- తూప్రాన్ రహదారి రేకులబావి వద్ద ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్, తూకం యంత్రాన్ని స్వాధీనం చేసుకొని మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షల వితరణ


ఆలయ అభివృద్ధికి చెక్కు అందజేస్తూ..

రామంతాపూర్: యాదవ సంఘం చైర్మన్ సర్వ శ్రీనివాస్ యాదవ్ గురువారం ఓల్డ్ రామంతాపూర్‌లోని శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.5 లక్షల చెక్కును ప్రధాన పురోహితులు మోత్కూరు శేఖర్‌బాబు శర్మ, అధికారి శ్రీనివాసరావుకు గురువారం అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, సర్వ రవియాదవ్, బాబుయాదవ్, సూర్య, మురళిగౌడ్, యాదవ్, అరుణ్, నవీన్ తదతరులు పాల్గొన్నారు.


జవహర్‌నగర్‌లో నివాళులర్పిస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు


మేడ్చల్ ఆర్టీసీ డిపోలో..

పూలే.. పేదల ఆశాజ్యోతి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలు అమోఘమన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. ఆయన ఆశయ సాధనే అసలైన నివాళి అన్నారు. మహిళలకు విద్య అవసరమని చెప్పి తన భార్యకి మొదటగా చదువు నేర్పించారని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు.


గుండ్లపోచంపల్లిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


ఘట్‌కేసర్‌లో జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో రాంరెడ్డి, ముత్యాలు, రాధాకృష్ణ


నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ కావ్య, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

కీసర: నరేంద్ర మోదీ మూడోసారి దేశ ప్రధాని అవడం ఖాయమని మేడ్చల్ -మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కీసర గ్రామానికి చెందిన రామిడి రాజశేఖర్‌రెడ్డి, పుండ్రు మల్లేష్, పోచయ్య, మచ్చాని కృష్ణాయాదవ్, కొండల్‌గౌడ్, రవి, నర్సింహ, తంగెళ్లపల్లి కృష్ణ, మహేష్ తదితరులు ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ సారి బీజేపీ 400లకు పైగా ఎంపీ స్థానాలు గెలుపొందడం ఖాయమన్నారు. ఇక తెలంగాణలో కూడా బీజేపీ అత్యధిక ఎంపీ అభ్యర్థులు గెలుస్తుందన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేస్తున్న తనను ఇక్కడి ప్రజలు ఎంపీగా గెలిపించుకోవాలని కోరారు. తాను ఎంపీగా గెలిస్తే ఇక్కడ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడతానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్ల వెంకట్‌రెడ్డి, జిల్లాల తిరుమల్ రెడ్డి, దేశం మల్లేష్‌గౌడ్, ఐలయ్యయాదవ్, మెట్టు కృష్ణాయాదవ్, చినింగని సుధాకర్, మహేందర్ యాదవ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు సత్యనారాయణ, చంద్రమౌళిచారి పాల్గొన్నారు.


ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న కీసర నాయికులు

దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు

ఉప్పల్: ఉప్పల్ తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిస్తా హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో పాదచారుల దప్పికను తీర్చడానికి ప్రతి ఏటా ఉప్పల్ ఆర్య సమాజ్ చేస్తున్న కృషిని కొనియాడారు. స్వచ్ఛంద సంస్థలు ద్వారా చేస్తున్న సేవలను ప్రజలు విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత బన్నాల ప్రవీణ్, ఫౌండేషన్ ప్రతినిధులు వేద సింధు, బొల్ల విజయ్ కుమార్, బ్రిజానంద్‌రెడ్డి, గోపి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత

ఘనంగా ఈసీఐఎల్ ఆవిర్భావ దినోత్సవం


ఏఎస్‌రావుకు నివాళులర్పిస్తున్న ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్ కుమార్ తదితరులు

కుషాయిగూడ: కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) సంస్థ 57వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం ఈసీఐఎల్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏఎస్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఎస్‌రావు ఈసీఐఎల్ అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు.

మూగజీవాల దాహం తీర్చేందుకు..

బోడుప్పల్: వేసవిలో దాహం తీర్చేందుకు నగర పాలక సంస్థ పరిధిలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు బోడుప్పల్ కమిషనర్ రామలింగం వెల్లడించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో గురువారం ఎన్టీఆర్ విగ్రహం, అంబేద్కర్ విగ్రహం, ఇందిరాగాంధీ విగ్రహం, మల్లిఖార్జున్‌స్వామి దేవాలయం వద్ద, చెంగిచర్ల పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల నిమిత్తం ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారుల కోసం ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మూగజీవాలకు నీటి తొట్లు

నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న మూగజీవాల కోసం, వన్య ప్రాణులు, పక్షుల కోసం నీటి తొట్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రామలింగం వెల్లడించారు. 28 డివిజన్ల పరిధిలో ఉన్న కాలనీల ప్రధాన రహదారుల వెంట తాగునీరు తాగేందుకు తొట్టెలను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ జిమ్‌ల వద్ద లక్ష్మీనగర్ పార్కు వద్ద ఏర్పాటు చేసి వర్షాకాల రుతువు వచ్చే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు చెప్పారు.


నీటి తొట్టిలో నీరు పోస్తున్న సిబ్బంది


నూతన్‌కల్‌లో మజీద్ వద్ద ముస్లింలు


కీసరదాయరలో..


నాగారంలో శుభాకాంక్షలు తెలుపుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

ఉత్సాహంగా ఈద్

పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల పాటు అత్యంత కఠినంగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫితర్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే మసీదులు, ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బంధువులు, స్నేహితులకు కీర్ తినిపించారు. మసీదులు, ఈద్గాలకు చేరుకున్న పలువురు నాయకులు ముస్లింలను ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.


మేడ్చల్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఘట్‌కేసర్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి


నారపల్లిలో ఈదుల్ ఫితర్ వేడుకలు


ఘట్‌కేసర్‌లో రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

కీసర: మండల కేంద్రమైన కీసరలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కీసర మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి తెలిపారు. సమావేశానికి మేడ్చల్- మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు కీసరగుట్టస్వామి సేవలో పాల్గొన్న అనంతరం ఉదయం 9 గంటలకు కేబీఆర్ గార్డెన్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు.

బాలగోనికి జ్యోతిబాపూలే అవార్డు



పోచారం: సామాజిక విప్లవ స్ఫూర్తి ప్రదాత జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా పోచారం మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్‌కు జ్యోతిబాపూలే అవార్డు లభించింది. జ్యోతిబాపూలే అవార్డు కమిటీ చైర్మన్ చిన్న శ్రీశైలం చేతులమీదగా ఈ అవార్డును అందుకున్నారు. తన సేవలను గుర్తించి అవార్డుతో సత్కరించినందుకు వెంకటేశ్ గౌడ్ సంతోషం వ్యక్తం చేశారు.

దివ్యాంగుడికి వైఎస్సార్ ట్రస్ట్ విరాళం


చెరుకు రసం మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రసాద్‌రావు తదితరులు

ఘట్‌కేసర్: వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన దివ్యాంగుడు క్రాంతికి జీవనోపాధి కోసం గురువారం చెరుకు రసం మిషన్‌ను గురువారం విరాళంగా ఇచ్చారు. ముఖ్య అతిథి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ ప్రసాద్‌రావుతో కలిసి ప్రారంభించారు. కౌన్సిలర్ పద్మారావు, రాజశేఖర్‌రెడ్డి, నరేశ్, జీవన్‌రెడ్డి, మల్లేశ్, రాంచందర్, సదానంద్‌రెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, శివనాయక్, విక్రాంత్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, రాము, వీరారెడ్డి, కుమార్, అనిల్, ప్రవీణ్, భానుయాదవ్, అశోక్‌గౌడ్, భాను, క్రాంతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎన్‌ఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ పారిజాతకు డాక్టరేట్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ నల్లా నర్సింహారెడ్డి(ఎన్ఎన్ఆర్) ఫార్మసీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ బి.పారిజాతకు ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ) గౌరవ డాక్టరేట్ లభించింది. ఓయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ అశోక్ పర్యవేక్షణలో చీలమండ ఆర్థరైటిస్, అరికాలి పాసిటిస్ వ్యాధులు నయం చేయడానికి నల్ల జీడిగింజలు, నువ్వులు పనిచేస్తాయని పరిశోధనలు చేసినందుకు ఉస్మానియా యూనివర్సిటీ ఆమెకు డాక్టరేట్ బహూకరించింది. డాక్టరేట్ లభించిన సందర్భంగా కళాశాల కార్యదర్శి సీవీ కష్ణారెడ్డి, ఫార్మసీ విభాగం అధిపతి ప్రొఫెసర్ కృష్ణమోహన్, అధ్యాపకులు అభినందించారు.

రైతులంతా హక్కుల కోసం పోరాటం చేయాలి


జవహర్‌నగర్‌లో జెండావిష్కరణలో పద్మ, నర్సింహులు

జవహర్‌నగర్: రైతులంతా సంఘటితమై హక్కుల కోసం పోరాటం చేయాలని మేడ్చల్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నిమ్మల నర్సింహులు అన్నారు. అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ గిరిప్రసాద్ నగర్‌లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ రాష్ట్ర సెక్రటరీ పశ్య పద్మ హాజరై జెండావిష్కరించారు. కార్యక్రమంలో దశరథ్, వెంకట్‌రెడ్డి, రాజేశ్వరి, జంగయ్య, కనకయ్య, లక్ష్మణ్, చంద్రయ్య, లక్ష్మీ, లత, కవిత, ఫాతిమా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన



కీసర: కీసర గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. గర్భాలయంలో కొలువైన శ్రీసీతారామచంద్రస్వామి, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహించిన అనంతరం వివిధ రకాల పూలతో అలకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. గ్రామ పురోహితుడు వెంపటి ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాధురి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, భక్త మండలి సభ్యులు, పన్నాల సుధాకర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, మల్లేష్, రామకృష్ణ, సత్యనారాయణ, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.